నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 20 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ముందే వచ్చిన 'ఆరుద్ర'



ఆరుద్ర పురుగులు

కోటపల్లి, మే 19 : ఆరుద్ర పురుగులు ముందే వచ్చాయి. ఆరుద్ర కార్తెలో రావాల్సిన పురుగులు కృత్తిక కార్తెలోనే వచ్చాయి. వీటిని పంటలకు మిత్ర పురుగులుగా రైతులకు మేలు చేసేవిగా భావిస్తారు. ఇవి వర్షాకాలంలోనే దర్శనమిస్తుంటాయి. కోటపల్లి మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో బీడు వారిన నేల నుంచి ఈ ఆరుద్ర పురుగులు దర్శనమిస్తుండడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోహిణి, మృగశిర కార్తెల తర్వాత వచ్చే ఆరుద్ర కార్తెలో రావాల్సిన పురుగులు ముందుగానే రావడంపై ఆశ్చర్యపోయారు. ఎండాకాలంలో వీటి దర్శనం శుభ సూచకమని, ఈ సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురుస్తాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

జైనూర్, మే 19 : జైనూర్ మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించవద్దని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జైనూర్ మండల కేంద్రంలో ఉన్న అన్ని దుకాణాల సముదాయాలను తెరిచి వ్యాపారాలను నిర్వహించుకోవచ్చని సూచించారు. ఈ మండలంలో లా అండ్ ఆర్డర్ సమస్య ఉన్నందున ఇతర మండలాల వారు జైనూర్‌లో నిర్వహించే సభలు, సమావేశాలకు హాజరయ్యేందుకు రావద్దని సూచించారు. మండల కేంద్రంలో పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిసున్నామని, ఇందులో భాగంగా ప్రధాన రాహదారిపై వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి వ్యాపారాలను కొనసాగించుకోవచ్చని వ్యాపారులకు తెలిపారు. ఏవైనా ఇబ్బందులుంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా మాట్లాడడం, ప్రచారం చేయవద్దన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు పోలీసులు పూర్తి స్థాయి భద్రత కల్పిస్తారని తెలిపారు. చట్ట వ్యతిరేక పరమైన చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

## హెచ్ఐవీ నియంత్రణ అందరి బాధ్యత

**మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత**

మంచిర్యాల ఏసీసీ, మే 19: హెచ్ఐవీ నియంత్రణకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, మంచిర్యాల అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖాన నుంచి ఐబీ వరకు అవగాహన ర్యాలీ తీశారు. 'ప్రేమ, సంఘీభావంతో గతం నేర్పిన పాఠాలతో బంగారు భవిష్యత్ నిర్మిద్దాం' అనే నినాదంతో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత మాట్లాడుతూ ప్రజలందరికీ ఈ సందేశాన్ని చేరవేయాలని తెలిపారు. హెచ్ఐవీ రోగులను గుర్తించడంలో, వారికి చికిత్స అందించడం, రోగులపై సద్భావనతో కలిగి ఉండడం, ప్రభుత్వం ద్వారా సాయం అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలందరూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఈ కార్యక్రమంలో డీఎస్వో ఫయాజ్, ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, డెమో బుక్క వెంకటేశ్వర్, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగని బియ్యం దందా

- దాడులు జరుగుతున్నా అస్మదీయుల అండతో యథేచ్ఛగా రవాణా
- స్థానిక అధికారుల పాత్రపై అనుమానాలు..?
- టాస్క్‌ఫోర్స్ దాడులు జరిగితే తప్పా కనిపించని తనిఖీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో దాడులు జరుగుతున్నా రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదు. పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. స్థానిక అధికారుల అండదండలు, రాజకీయ నాయకుల సహాయ సహకారాలతోనే బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతున్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. బియ్యం రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారిపై కేసులు నమోదవుతున్నప్పటికీ అక్రమ బియ్యం దందా మాత్రం ఆగడం లేదు. అక్రమార్కులు వివిధ మార్గాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది. బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి పట్టుకున్న అధికారులు ఇటీవల అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడంతో అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాగా మారింది. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్-టీ మీదుగా చౌక బియ్యం పొరుగుకు రాష్ట్రానికి రవాణా అవుతున్నది. ఈ దందా ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం నుంచి మొదలవుతున్నది.

### మహారాష్ట్రకు అక్రమంగా తరలింపు..

కొంతమంది వ్యాపారులు ప్రత్యేకంగా రేషన్ బియ్యం కొని వాటిని విక్రయించడమే వృత్తిగా పెట్టున్నారు. కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ షాపు వద్దనే కొనడం, మరి కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇవ్వకుండానే నేరుగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కిలో బియ్యాన్ని రూ.12కు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాల్లో రూ.20కు వరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రకు తరలి వెళ్తున్న బియ్యాన్ని పట్టుకునేందుకు మధ్యలో ఎక్కడ చెక్‌పోస్టులు లేవు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వ్యాన్‌లలో జిల్లాలో వాంకిడి, సిర్పూర్-టీ మండలంలోని వెంట్రావ్‌పేట్, తదితర మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ గోదాముల్లో డంప్ చేసి, అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొండియా, బల్లార్షలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు.



వాంకిడి: ఈ నెల 18న సరాండి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్న 123 క్వింటాళ్ల బియ్యం వ్యాన్‌తో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్



ఇటీవల కాగజ్‌నగర్ చింతగూడ కోయవాగు వద్ద అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా 122 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

### దాడులు నిర్వహించినా ఆగని రవాణా..

టాస్క్‌ఫోర్స్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తూ కేసులు పెడుతున్నా ఎలాంటి భయం లేకుండా అక్రమార్కులు దందాను కొనసాగిస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు పెంచికల్‌పేట్‌లో ఓ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి రవాణాకు సిద్ధంగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ చింతగూడా కోయవాగు వద్ద అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 122 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 18న వాంకిడి మండలంలో సరాండి టోల్ ప్లాజా వద్ద 123 క్వింటాళ్ల బియ్యం వ్యాన్‌లో తరలిస్తుండగా తనిఖీ చేసి అధికారులు పట్టుకున్నారు. పక్కా సమాచారంలో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహిస్తే తప్పా స్థానిక అధికారులు అక్రమ బియ్యం రవాణాను అడ్డుకున్న దాఖలాలు ఎక్కడ లేవు. దీంతో స్థానిక అధికారుల సహకారాలు అక్రమార్కులకు అందుతున్నాయన్నా ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు నిఘా పెట్టి, అక్రమారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బాధితులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు

## దళితుల భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు**

ఆసిఫాబాద్ టౌన్, మే19 : అమాయక దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతల మానేపల్లి మండలం బాలాజీ అనుకోడా, రనవెల్లి శివారులో శంకరయ్య సూర్యాదాస్, కొం డయ్య, సోమయ్య, రుషి, విజయ్‌కి చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని నానయ్య, చిన్నక్క, ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, జయపాల్, పురుషోత్తం అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. బాధితులు తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లావుని పట్టా భూములను పట్టాదారులకు తెలియకుండా అధికారులు, కబ్జాదారులు ఒక్కటై అక్రమంగా పట్టాలను చేసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేసి అర్హులైన వారికి పట్టాలు అందించి, భూమిని చూయించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు శంకర్, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలతో చెలగాటం

- అమాయకులతో ఆడుకుంటున్న ఆర్ఎంపీలు
- హైడోస్ మందులు.. కమీషన్ల పేరిట దండుకోవడం..
- విస్తృతంగా ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ బృందాల తనిఖీలు
- 23 మంది ఆర్ఎంపీలపై కేసుల నమోదుకు సిఫార్సు

మంచిర్యాల ఏసీసీ, మే 19 : మంచిర్యాల జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీలు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జ్వరమో, నొప్పో అని పోతే హైడోస్ ఇంజక్షన్లు, యాంటిబయోటిక్ మందులు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మరో వైపు పెద్ద రోగం వస్తే వారికి తెలిసిన ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేస్తూ కమిషన్ల రూపంలో డబ్బులు దోచుకుంటున్నారు. తమ పరిమితికి మించి వైద్యం చేస్తున్నారనే సమాచారం మేరకు కలెక్టర్, వైద్యారోగ్యశాఖ అధికారులు పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా తీరు మారడం లేదు. ఈ మధ్య కాలంలో ఎన్ఎంసీ, టీఎంసీ బృందాలు తనిఖీలు నిర్వహించి 20 మందికి పైగా ఆర్ఎంపీలపై నేషనల్ కౌన్సిల్ యాక్ట్ ప్రకారం కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. గత నెలలో లక్షెట్టిపేటకు చెందిన ముగ్గురు ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం అందిస్తున్నారని తెలియడంతో వారిపై అక్కడి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు.

### పుట్టగొడుగుల్లా క్లీనిక్‌లు

గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఏదైనా రోగమొస్తే మొదటగా గుర్తొచ్చేది ఆర్ఎంపీలే. ఇలా రోగులు వస్తుండడంతో క్లీనిక్‌లు గల్లీకొకటి చొప్పున పుట్టుకొస్తున్నాయి. రెండు లేదా మూడు గదులను అద్దెకు తీసుకుని, మంచి ఫర్నిచర్ పెట్టి మెరుగైన వైద్యం అందిస్తామనే స్థాయిలో ఆకర్షిస్తున్నారు. ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి. తీవ్రతను బట్టి పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలి. కానీ.. ప్రిస్కిప్షన్ పెట్టుకుని ల్యాబ్ టెస్టులు, మందులు, స్కానింగ్‌లు చేస్తున్నారు. ఫ్లూయిడ్స్ అమర్చి పరిమితికి మించి యాంటిబయోటిక్స్ ఇంజక్షన్లు ఇస్తూ రోగాన్ని తగ్గిస్తున్నారు.



అప్పటి డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన సమావేశం

### 20 మందిపై కేసు

పట్టణాలు, గ్రామాల్లో అర్హతకు మించి ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యం అందిస్తున్నారనే పూర్తి సమాచారంతో నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ), తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు(టీఎస్ఎంసీ) గ్రూపులుగా టీఎస్ఎంసీ మెంబర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎథికల్ అండ్ యాంటీ క్వాకర్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, స్టేట్ చైర్మన్ కిరణ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో గత మార్చిలో మంచిర్యాలలో ఇద్దరు, లక్షెట్టిపేటలో ఇద్దరు ఆర్ఎంపీలను గుర్తించి కేసులు నమోదు చేయించారు. తాజాగా జిల్లా కేంద్రంలో ముగ్గురు, నస్పూర్‌లో 11మంది, మందమర్రిలో ముగ్గురు, తాండూర్‌లో ముగ్గురు మొత్తం 20 మంది ఆర్ఎంపీలపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ ప్రకారం కేసుల నమోదుకు సిఫార్సు చేశారు.

### నిరంతరం తనిఖీలు చేస్తాం..



ఆర్ఎంపీ, పీఎంపీల వ్యవస్థను దారిలోకి తీసుకొస్తాం. కొంద రు ఆర్ఎంపీలు హైడోస్ మందులు ఇవ్వడం వల్ల సైడ్ ఎఫెక్ట్‌లు వస్తాయి. కిడ్నీలు ఫెయిల్ అవ్వడం వంటి సమస్యలు వస్తాయి. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ఇకనైనా మారి స్థాయికి మంచి వైద్యం అందించకుండా ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి.

*- డాక్టర్ శ్రీనివాస్, టీఎంసీఎస్ సభ్యుడు, మంచిర్యాల.*


## నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా

- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ బృందాల ఏర్పాటు
- అక్రమార్కులపై పీడీయాక్ట్ అమలు
- పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మే 19: నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి రైతులకు విక్రయించి మోసం చేస్తున్నారని తెలిపారు. వాటితో సరైన దిగుబడులు రాక రైతులు, అప్పుల పాలై నష్టపోతున్నారన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలు అరికట్టడం, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వారిని అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో విత్తన, ఎరువుల దుకాణాలు, గోదాములలో ఆకస్మికంగా తనిఖీలు, శాంపిల్స్ సేకరించి వెంటనే పరీక్షలకు పంపించడం, విత్తనాలు రవాణా చేసే వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీ చేస్తామని తెలిపారు. లైసెన్సులు లేకుండా వ్యాపారం చేసే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నకిలీ విత్తన అక్రమార్కులపై పీడీయాక్ట్ అమలుకు జాబితా కూడా సిద్ధం చేసినట్లు సీపీ తెలిపారు.



ORIGINAL TOLL FREE No. 18004250028

NPDCL ELECTRICITY CHARGES RECEIPT

Superintending Engineer, Opn. Mancheril

SC No. 77 | BCRC No. 77

Distn. Gundlapad | Dist. No. 63214

Rs. Ps. | Month

CC Charges 183 | Date : 15/5/24

Arrears

RC

ACD

Supchg.

Theft

183

Rs.(in words)

PR No. : B 330429

Sign. of Receiving Authority

ఆదివాసీ గిరిజన కుటుంబం బిల్లు కట్టిన రసీదు

## పేదోడికి ఏదీ ఉచిత విద్యుత్..?

**పూరి గుడిసెలో ఉండే వృద్ధులకు వర్తించని గృహజ్యోతి పథకం**



ప్రజాపాలన రసీదులను చూపుతున్న వృద్ధ దంపతులు

కాసిపేట, మే 19 : ఉచిత విద్యుత్ పథకంపై గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గుండ్లపాడ్ చెందిన నిరుపేద ఆదివాసీ గిరిజన కుటుంబానికి ఉచిత విద్యుత్ పథకం అందడం లేదు. గుండ్లపాడ్ గ్రామానికి చెందిన మడావి అంబుబాయి, భీము అనే ఆదివాసీ గిరిజన దంపతులు పూరి గుడిసెలో ఉంటున్నారు. వీరికి రేషన్ కార్డు, విద్యుత్ మీటర్ ఉన్నది. ఉచిత విద్యుత్ వస్తుందని ఆనందంతో అన్ని పత్రాలతో ప్రజాపాలన సభలో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి చదువు రాకపోవడంతో అక్కడ ఉన్న ప్రజాపాలన అధికారులకే అధికారులే నింపారు. ఉచిత విద్యుత్ వస్తుందని సంతోష పడ్డ ఆదివాసీ గిరిజన వృద్ధులకు నిరాశే మిగిలింది. ఇప్పటి వరకు వారికి ఉచిత విద్యుత్ పథకం అమలు నోచుకోలేదు. వీరు ప్రతినెలా 50 నుంచి 60 యూనిట్లు మాత్రమే వినియోగిస్తుండగా బిల్లు రూ.183 ఇలా బిల్లు వస్తుంది. ప్రభుత్వం 200 యూనిట్లు ఫ్రీ అని గొప్పలు చెప్పగా ఇంత తక్కువ బిల్లు, యూనిట్లు ఉన్న నిరుపేద కుటుంబానికి మాత్రం ఫ్రీ కరెంట్ అందించడం లేదని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా బిల్లు రాగానే కట్టాల్సిందేనని అధికారులు అనడంతో పాపం ఆ వృద్ధులు చేసేది ఏమీ లేక బిల్లు కడుతున్నారు. పలుమార్లు అధికారులు, సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆ వృద్ధ దంపతులు కోరుతున్నారు.

# నీరుగారిన రీడింగ్ కల్చర్

- తాళ్లపేటలో తెరుచుకోని లైబ్రరీ
- కేసీఆర్ ప్రభుత్వంలో ప్రారంభం.. నేడు నిరుపయోగం
- పాలకుల పట్టింపులేని తనం.. అధికారుల నిర్లక్ష్యం
- అన్ని వసతులున్నా ఫలితం శూన్యం
- ఉపయోగంలోకి తెస్తే విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఎంతో మేలు





నిరూపయోగంగా మారిన గ్రంథాలయం

*గ్రామాల్లో రీడింగ్ కల్చర్.. నీరుగారింది. కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది రూపాయలతో పౌరుల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ లైబ్రరీ నిరుపయోగంగా మిగిలిపోయింది. నేటి పాలకుల పట్టింపులేని తనం.., అధికారుల నిర్లక్ష్యం తాళ్ల పేట గ్రంథాలయానికి శాపంగా మారింది. ఇక్కడ పుస్తకాలు, పిరియాడికల్స్ అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకొని ఉపయోగంలోకి తేవాలని ప్రజలు, పోటీ పరీక్షల అభ్యర్థులు కోరుతున్నారు.*

దండేపల్లి, మే 19 : గ్రామాల్లో రీడింగ్ కల్చర్ ప్రోత్సహించేందుకు కేసీఆర్ ప్రభుత్వం నడుంబిగించింది. పౌరుల భవిష్యత్‌ను పెటుటకొని పల్లెల్లో పబ్లిక్ లైబ్రరీలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా నిరుపయోగంగా ఉన్న భవనాలను గుర్తించి, మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చింది. దండేపల్లి మండలం తాళ్లపేటలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ భవనాన్ని రూ.3.50 లక్షలతో మరమ్మతులు చేయించింది. దీనిని లైబ్రరీగా మార్చింది. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గతేడాది జూన్ 20న అప్పటి మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు. కానీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మిగిలిపోతున్నాయి. నేటి పాలకులు దానిని పట్టించుకున్న పాపాన పోలేదు. అదనపు కలెక్టర్ రాహుల్ ప్రత్యేక పర్యవేక్షణలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను అప్పట్లో నూతన లైబ్రరీల కోసం వినియోగించారు. ఒక్కో లైబ్రరీ కోసం రూ.3.5లక్షకు పైగా ఖర్చు చేశారు. గ్రంథాలయంలో పుస్తకాలు, పీరియాడికల్స్ అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోతున్నది.



తాళ్ల పేటలో లైబ్రరీని ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ రాహుల్ (ఫైల్)

### వసతులున్నా ఫలితం శూన్యం..

గ్రంథాలయాల్లో టేబుళ్లు, కుర్చీలు, లైట్లు ఏర్పాట్లు చేశారు. అన్ని వయసుల వారు చదువుకునేలా తీర్చిదిద్దారు. ప్రారంభమై ఏడాది గడుస్తున్నా.. ఇప్పటి వరకు తెరిచి ఉంచకపోవడంతో విద్యార్థులు, యువకులు నిరుత్సాహపడుతున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో నిరుద్యోగులకు సైతం ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. పాఠకుల అభిరుచి మేరకు మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేసి, లైబ్రరీని ప్రతిరోజూ తెరిచి ఉంచాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.